సాక్షి
వికారాబాద్

గురువారం । 9 । జనవరి । 2025



గంజాయి పట్టివేత

జిల్లా ఎక్సైజ్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్త దాడిలో బుధవారం 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



కామారెడ్డి డిక్లరేషన్..

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. 8లో▸



మార్కెట్ అభివృద్ధికి కృషి

కుల్కచర్ల మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

మాతాశిశు సంరక్షణకు చర్యలు

ఎంసీహెచ్ ప్రోగ్రాం జిల్లా అధికారి పవిత్ర



కొత్తపల్లి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి పవిత్ర

బంట్వారం: మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంసీహెచ్ ప్రోగ్రాం జిల్లా అధికారి పవిత్ర అన్నారు. బుధవారం కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మెడికల్ ఆఫీసర్ మేఘనకు పలు సూచనలు చేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం మందులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మేఘన, డాక్టర్ బీబీ జానీ, ఫార్మసిస్ట్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు పట్నం నరేందర్‌రెడ్డి



పట్నం నరేందర్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

బొంరాస్‌పేట: లగచర్ల ఘటనలో ఏ–1 ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చారు. బెయిల్‌పై ఉన్న ఆయన కోర్టు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం స్థానిక ఠాణాలో హాజరు కావాల్సి ఉండగా వచ్చారు. స్టేషన్ నుంచి బయటికి వచ్చిన నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు నరేందర్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల మహిపాల్, యాదగిరి, నెహ్రూ నాయక్, తిరుపతయ్య, వాహబ్, హీర్యానాయక్, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పాము కలకలం

- భయంతో పరుగులు తీసిన విద్యార్థులు
- పట్టుకొని అడవిలో వదలిపెట్టిన స్నేక్ స్నాచర్



పామును పట్టుకుంటున్న స్నేక్ స్నాచర్

దోమ: మండలంలోని బడేంపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నాగుపాము కలకలం రేపింది. స్కూల్ ఆవరణలో పా మును చూసిన విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల చుట్టూ పొలాలు ఉండటంతో పాము ఇక్కడికి వచ్చి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఉపాధ్యాయులు స్నేక్ స్నాచర్‌కు సమాచారం ఇవ్వడంతో అతను పాఠశాలకు చేరుకొని పామును పట్టుకొని సమీప అడవిలో వదిలిపెట్టాడు. దీంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అయితే తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతోనే పాములు సంచరిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరారు.

సమావేశంపై వాగ్వాదం

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో అధికారులు చేపట్టిన సమావేశం విషయమై అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం లేమూరు రెవెన్యూ పరిధిలో ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో భూసేకరణ విషయమై చర్చించడానికి ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న లేమూరు రైతులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని రైతులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆర్డీఓ మరోసారి భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమవుదామని చెప్పి అక్కడి నుంచి అందరినీ పంపించి వేశారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

సప్తవర్ణ శోభితం

సాక్షి దినపత్రిక.. గంగోత్రి విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తాండూరు పట్టణంలోని గంగోత్రి విద్యాలయ ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముత్యాల్లాంటి ముగ్గులు వేసి.. రంగులతో చక్కగా తీర్చిదిద్దారు. పండుగ విశిష్టత తెలిపేలా ముగ్గులు వేశారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– తాండూరు

- వివరాలు 9లో▸



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, గంగోత్రి విద్యాలయ చైర్మన్ ఇందూర్ రాములు తదితరులు

మంచు.. ముప్పు

పడిపోతున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు

- ఉదయం 10 గంటలు దాటినా తగ్గని చలి తీవ్రత
- శ్వాసకోశ వ్యాధుల బారిన జనం
- పంటలపై కూడా ప్రభావం
- జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు



ఆలేడ్ గ్రామాన్ని కమ్మేసిన పొగమంచు

దుద్యాల్: చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతూ అందరినీ భయపెడుతోంది.. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా అందరినీ వణికిస్తోంది. ఉదయం 9గంటల వరకు పొగ మంచు గ్రామాలు, పొలాలను కమ్మేస్తోంది. 10గంటలు దాటినా తీవ్రత తగ్గడం లేదు. కొద్ది రోజులుగా రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. రాత్రి వేళ మంచు కురుస్తుండటంతో జనాలు వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా మంది జ్వరం, జలుబు, ఉబ్బసంతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. మంచు, చలి పంటలపైనా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత వాతావరణం కొన్ని పంటలకు మేలు చేస్తుండగా మరి కొన్నింటికి నష్టం కలిగిస్తోంది. మామిడి, తెల్లజొన్న, శనగ, తెల్ల కుసుమ వంటి పంటలకు అనుకూలంగా ఉంటుంది. వరి నారు, మొక్కజొన్న పంటలు ఎదగవు. వేకువజామున పనులకు వెళ్లే వారు చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు, వేరుశనగ హర్వెస్టింగ్ వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ కూలీలు, రైతులు, విద్యార్థులు, వివిధ రకాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు, మార్నింగ్ వాక్ చేసేవారు చలికి గజగజ వణకిపోతున్నారు.

శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం

ఉదయం మంచులో తిరిగేవారికి శ్వాసకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలి తీవ్రత పెరిగే కొద్ది రక్త నాళాలు సంకోచిస్తాయి. దీంతో ఆవయవాలకు రక్త ప్రసరణ తగ్గి గుండె మరింత వేగంగా పని చేయాల్సి ఉంటుంది. గుండె జబ్బులు, మధుమేహం, ఆస్తమా వంటి వ్యాధులు ఉన్న వారికి శీతాకాలం శత్రువనే చెప్పాలి. ఈ క్రమంలో జ్వరం, జలుబు వంటి అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. మంచు శరీరానికి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులు చలిలో తిరగరాదన్నారు.

స్వెట్టర్లకు డిమాండ్

చలి నుంచి రక్షణ ఇచ్చే స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, ఉన్ని వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. జిల్లాలోని ప్రధాన రహదారుల పక్కన తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకొని వీటిని విక్రయిస్తున్నారు. ప్రజలు వీటిని కొనుగోలు చేసి చలి నుంచి రక్షణ పొందుతున్నారు.



చలి తీవ్రతకు పెరగని వరిపైరు

జాగ్రత్తలు తప్పని సరి



చలికాలంలో ఆరోగ్యంగా ఉన్నవారు కూడా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.నిత్యం గోరువెచ్చని నీటిని తాగాలి. వేడివేడి ఆహారం, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.ఉదయం,రాత్రి వేళల్లో బయట తిరగరాదు.ఒకవేళ వెళ్లాల్సి వస్తే రక్షణ దుస్తులు ధరించాలి. అలర్జీ, జలుబు చేస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ వందన, హకీంపేట్ పీహెచ్‌సీ

వరి నారుపై ప్రభావం



చల్లని వాతావరణం మామిడి, శనగ, తెల్ల కుసుమ వంటి ఉద్యానవన పంటలకు మేలు చేస్తుంది. వరి నారు మడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పైరుకు అగ్గి తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పంట ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు టీజీసెట్.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫొటో జత చేయాలని పేర్కొన్నారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్ఓఈలలో 8వ తరగతిలో ప్రవేశాలకు, అలుగునూరులోని సి.ఓ.ఈలో 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ సర్వేపై ఆందోళన

ఆమనగల్లు: ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి ఫోర్త్‌సిటీ మీదుగా ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి వద్ద మంగళవారం సర్వేను రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే కోసం ఆర్‌వీ కన్సల్టెన్సీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు బుధవారం మున్సిపల్ పరిధిలోని సాకిబండతండాకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక గిరిజన రైతులు అడ్డుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూముల్లో సర్వే చేసే అధికారం ఎవరిచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ఉన్నకొద్దిపాటి భూమి పోతే ఎలా బతుకుతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తిరిగి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్నవారికి సీఐ ప్రమోద్‌కుమార్ నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. చివరికి సర్వే చేయకుండానే సిబ్బంది, అధికారులు వెనుతిరిగారు.



రైతులకు నచ్చజెబుతున్న సీఐ ప్రమోద్‌కుమార్

అన్మాస్‌పల్లి, ముద్విన్ పరిధిలో మార్కింగ్..

కడ్తాల్: మండలంలోని అన్మాస్‌పల్లి, ముద్విన్ రెవెన్యూ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మార్కింగ్ సర్వే బుధవారం సజావుగా కొనసాగింది. ఆర్‌వీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. 330 అడుగుల రోడ్డు నిర్మాణానికి కడ్తాల్ రెవెన్యూ పరిధిలోని అన్మాస్‌పల్లిలో సుమారు రెండు కిలోమీటర్లు, ముద్విన్ రెవెన్యూ పరిధిలో 4 కిలోమీటర్ల వరకు సర్వే నిర్వహించి మార్కింగ్ వేశారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

బెదిరింపులకు జంకొద్దు

- ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ప్రజలు జంకరాదని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం వికారాబాద్‌లోని వికాస్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల డిజిటల్ అరెస్టు అనే మోసపూరితమైన బెదిరింపుతో అమాయక ప్రజలకు ట్రాయ్, సీబీఐ, కస్టమ్స్, నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ అధికారుల మంటూ ఫోన్లు, వాట్సాప్, టెలిగ్రాం కాల్స్ వస్తున్నాయని తెలిపారు. అమాయక ప్రజల్ని భయపెట్టి కోట్లలో డబ్బు కాజేస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఒకవేళ మోసం జరిగిందని భావిస్తే వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పోలీస్ అధికారులకు సన్మానం

ఇటీవల దౌల్తాబాద్ పీఎస్ పరిధిలో 2022లో నమోదైన అత్యాచారం కేసులో నిందితునికి జీవితఖైదు పడేలా పని చేసిన అధికారులను బుధవారం ఎస్పీ నారాయణరెడ్డి తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నిందితుడికి జీవిత ఖైదు పడేలా పనిచేసిన అడిషనల్ పీపీ మెరాజ్ ఫిర్దౌస్, ప్రస్తుత దౌల్తాబాద్ ఎస్‌హెచ్ఓ రవిగౌడ్, భరోసా ఇన్‌చార్జ్ శైలజ, సీడీఓ సురేష్‌గౌడ్, ఏడీజే కోర్టు లైజన్ ఆఫీసర్ నిరంజన్‌గౌడ్, బ్రీఫింగ్ అధికారి కీర్తిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు కలిసి పని చేయడం వల్ల నేరం చేసిన వ్యక్తి శిక్ష పడిందన్నారు. ఇక ముందు కూడా ఇలాగే సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళలు, బాలికల జోలికి వెళితే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు

మొయినాబాద్: మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని ఆయా గ్రామాల నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌కు విన్నవించారు. ఈ మేరకు బుధవారం వారిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తుజగూడ గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా చేస్తున్నట్లు ప్రతిపాదించారని.. పూర్తిగా గ్రామీణ ప్రాంతంగా ఉన్న పంచాయతీలను మున్సిపాలిటీగా చేయడంతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 111 జీఓ అమలులో ఉన్న ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా చేయొద్దని కోరారు. వినతిపత్రాలు అందజేసినవారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు గరుగు రాజు, అశోక్‌యాదవ్, జకరయ్య, రాములు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై చిగురిస్తున్న ఆశలు

- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్న మంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఆనందం
- నాలుగు మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తులు 21,084
- గ్రామ పంచాయతీల్లో 16,229
- పరిశీలించినవి 600 లోపే..



నస్కల్ గ్రామంలో అనుమతి లేకుండా చేసిన వెంచర్

వికారాబాద్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆరు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగింది.. అర్జీల పరిశీలనకు కమిటీలు వేసినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఇప్పటి వరకు పది శాతం దరఖాస్తులు కూడా పరిశీలించిన దాఖలాలు లేవు. పదేళ్లుగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో డీటీసీపీ అనుమతులు లేకుండా వెంచర్లు చేశారు. చాలా మంది వాటిలో ప్లాట్లు కొనుగోలు చేశారు. 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీఎస్ బీపాస్ నిబంధనలు అమలులోకి తేవడంతో అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళకు గురయ్యారు. ఇంటి నిర్మాణ అనుమతులు పొందాలంటే ప్లాట్లకు, వెంచర్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్లాట్ల క్రమబద్ధీకరణ తప్పనిసరిగా మారింది. నాలుగేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. తదనంతర ప్రక్రియ చేపట్టలేదు. దీంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ప్రకటించడంతో దరఖాస్తుదారులకు ఊరట లభించినట్లయ్యింది.

మొత్తం దరఖాస్తులు 37,313

జిల్లాలో అనుమతి లేకుండా చేసిన లే అవుట్లే అధికంగా ఉన్నాయి. దాదాపు 550 లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రభుత్వం రుసుం చెల్లించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు వచ్చి పడ్డాయి. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నుంచి 21,084 దరఖాస్తులు రాగా.. గ్రామ పంచాయతీల నుంచి 16,229 అర్జీలు వచ్చాయి. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పరిశీలన ప్రక్రియను చేపట్టింది.

అధికారులతో కమిటీలు

ఇప్పటి వరకు రెండు దఫాలుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు పలువురు రూ.1000 చెల్లించగా.. మరి కొందరు రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత కోర్టు కేసులు.. ప్రతిపక్షాలు.. ప్రజా సంఘాల ఆందోళనల నేపథ్యంలో అప్పటి సర్కారు ఎల్‌ఆర్‌ఎస్‌ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. వ్యవసాయేతర భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లను ఎల్‌ఆర్‌ఎస్‌తో సంబంధం లేకుండా పాత పద్ధతిలోనే జరిగేలా ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతులు లేని వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్ల క్రయ విక్రయాలకు అనుమతి ఇచ్చింది. 2020 నుంచి ఇప్పటి వరకు అదే పద్ధతి కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్‌కు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. దరఖాస్తుల పరిశీలనకు మూడు శాఖల అధికారులతో త్రిసభ్య కమిటీ వేశారు. జీపీల్లో దరఖాస్తుల పరిశీలనకు ఆర్‌ఐ, టీపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ ఏఈలతో కమిటీ వేయగా.. పట్టణాల్లో టీపీఓ, ఆర్‌ఐ, ఇరిగేషన్ ఏఈ, వార్డు ఆఫీసర్‌తో కమిటీలు వేశారు. అయితే జిల్లాలో ఏఈల కొరత, ఆర్‌ఐలకు పని భారం కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడంలేదని అధికారులు అంటున్నారు.

మరకత శివాలయం మహాద్భుతం

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఏదో తెలియని మహిమ దాగుందని కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప మనుమడు, అమేయ గ్రేగ్ గ్రూప్ అధినేత నిఖిల్ చంద్ర ముళ్లపూడి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, సినీ నటి కారుణ్య చౌదరి అన్నారు. బుధవారం వారు ఆలయాన్ని దర్శించారు. లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ దేవాలయ ప్రాముఖ్యత, విశిష్టత గురించి ఎంతో మంది చెప్పారని.. ఈరోజు ప్రత్యక్షంగా దర్శించుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆలయంలో ఏదో అద్భుత శక్తి దాగి ఉన్నట్లు అనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించి, మరకత శివాలయ పటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ శేఖర్, సభ్యులు హనుమంతు, మాజీ సర్పంచి శ్రీనివాస్, అర్చకుడు శివసాయి ప్రసాద్ పాల్గొన్నారు.



నిఖిల్ చంద్ర ముళ్లపూడి, అనంత శ్రీరామ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్లుప్తంగా

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

అనంతగిరి: స్వయం సహాయక సంఘాల నుంచి సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ప్రగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బుధవారం మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాభవన్ వేదికగా నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎలక్ట్రిసిటీ ఎస్‌ఈ లీలావతి, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలను మండల తహసీల్దార్లను ఆదేశించారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవం

మహేశ్వరం: భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదుతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా అడిషనల్ కోర్టు తీర్పునిచ్చింది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన అల్వాల నర్సింహకు మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన జెన్నపల్లి మంగమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులుంగా మహేశ్వరం హాస్టల్‌లో ఉంటూ చదవుకుంటున్నారు. మంగమ్మ జీవనోపాధి కోసం మాణిక్యమ్మగూడలో జెన్నపల్లి యాదయ్య ఇంట్లో అద్దెకుంటోంది. దంపతులు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో 2021 నవంబర్ 29న అద్దె ఇంట్లో భార్య మంగమ్మ మెడకు వైర్‌తో ఉచ్చు బిగించి హత్య చేశాడు. మృతురాలి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు మహేశ్వరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి రంగారెడ్డి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు వాదనలు విన్న మెజిస్ట్రేట్ అల్వాల నర్సింహకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

'ప్రైవేట్‌శక్తులకు ప్రజా సంపద'

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను ప్రైవేట్ శక్తులకు కట్టబెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతాలను ఉపయోగించుకొని బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్స్, రేషన్ కార్డులు, ధరణి సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగబోయే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యాజ్యోతి కళాశాలలో రూ.15.24 లక్షలు చోరీ

మొయినాబాద్: ఇంజనీరింగ్ కళాశాల ఆఫీస్‌రూం కిటికీలో నుంచి గుర్తు తెలియని దుండగుడు చొరబడి చోరీకి పాల్పడ్డాడు. లాకర్‌లో ఉన్న రూ.15.24లక్షలు దోచుకెళ్లాడు. ఈ సంఘటన మండల పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆఫీస్‌రూంలోకి మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని దుండుగుడు కిటికీ గ్రిల్‌ను తొలగించి లోపలికి దూరాడు. ఆఫీస్‌లో ఉన్న తాళంచెవితో లాకర్ ఓపెన్ చేసి రూ.15.24 లక్షలు దోచుకుని వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళాశాలకు వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొయినాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం, సీసీఎస్ పోలీసులను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగుడిని గుర్తించే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాల్కి ముఠా సంచరిస్తోంది.. జాగ్రత్త!

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీలు
- సీసీ ఫుటేజీ విడుదల చేసిన పోలీసులు
- అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి



సీసీ కెమెరాలో రికార్డయిన కొనాపూర్‌లో చోరీకి పాల్పడిన బాల్కి ముఠా ఫుటేజీ

తాండూరు రూరల్/యాలాల: తాండూరు పరిసర ప్రాంతాల్లో కర్ణాటకకు చెందిన బాల్కి దొంగల ముఠా గుబులు పుట్టిస్తోంది. పగలు రెక్కీ నిర్వహించి తాళాలు ఉన్న ఇళ్లే టార్గెట్‌గా రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతోంది. ఈ ముఠా వారం రోజుల క్రితం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ అనుబంధ గ్రామం కొనాపూర్‌లో తాళం వేసిన నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడింది. గ్రామానికి చెందిన నర్సింలు ఇంట్లో బంగారు ఆభరణాలతో పాటుగా నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఐదుగురు దొంగలు ముఖాలకు బట్టలు కట్టుకుని గ్రామంలోకి చొరబడి చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ ముఠా గతంలో మండల పరిధిలోని ఖాంజాపూర్, యాలాల మండలం కోకట్ గ్రామాల్లోనూ దొంగతనాలకు యత్నించినట్లు తెలిసింది. ఈ ముఠాను పట్టుకునేందుకు ఇప్పటికే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని పోలీసులు వెల్లడించారు.

అనుమానం వస్తే..సమాచారం ఇవ్వండి

కర్ణాటక రాష్ట్రం బాల్కికి చెందిన కొందరు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి తాండూరులో నివాసముంటున్నారు. పగలు పట్టణంలోని కాలనీలతో పాటు గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్నారు. తర్వాత ఓ గ్యాంగ్‌గా వెళ్లి రాత్రికి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే తాండూరు డీఎస్పీ ఫోన్ నెంబర్ 8712670017, సీఐ రూరల్ 8712670051, పట్టణ సీఐ 8712670049, కరన్‌కోట్ ఎస్ఐ 8712670052 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

'లక్ష డప్పులు.. వేయి గొంతులు'

విజయవంతం చేయండి



మండల అధ్యక్షుడు నర్సింహకు నియామకపత్రం అందజేస్తున్న గోపాల్ మాదిగ

బషీరాబాద్: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేయి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌మాదిగ, మల్లికార్జున్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం బషీరాబాద్‌కు వచ్చిన వారు మండల కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగల బలప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జిల్లా నుంచి పెద్ద ఎత్తున మాదిగలు, ఉపకులాలు, డప్పు కళాకారులు, రచయితలు తరలిరావాలని కోరారు. అనంతరం బషీరాబాద్ మండల కమిటీ అధ్యక్షుడిగా నర్సింహ అధికార ప్రతినిధిగా సునిల్, ప్రధాన కార్యదర్శిగా బసప్ప, ఉపాధ్యక్షులుగా సంతోష్, భీమప్ప, కార్యదర్శులుగా శ్యామ్, సుభాష్, రాజును నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి మహేందర్ మాదిగ, కన్వీనర్ శివాజీ మాదిగ, తాండూరు అధ్యక్షుడు జగదీష్ మాదిగ, పరుశురాం మాదిగ, శ్రీనివాస్ మాదిగ, నరసింహులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి పట్టివేత

ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, చిత్రంలో నిందితుడు శిబిరాం స్వైన్

తాండూరు టౌన్: జిల్లా ఎక్సైజ్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్త దాడిలో బుధవారం 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలో నిర్వహించిన దాడిలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన శిబిరాం స్వైన్ వద్ద 12 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం తాండూరు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి వదిలివెళ్లిన బ్యాగులో 16 కిలోల ఎండు గంజాయి, రెండు కిలోల గంజాయి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ ప్రేమ్ కుమార్ రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, రవి కిరణ్, శివ, మహేందర్, కుమార్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుకు గడువు పెంపు

బంట్వారం: అర్హులైన విద్యార్థులంతా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 2024 వరకు విధించిన కాల పరిమితిలో వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో బీసీ సంక్షేమ సంఘం వినతి మేరకు బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ స్పందించి దరఖాస్తులకు స్వీకరణ గడువును మార్చి 31 వరకు పొడిగించిందన్నారు.

ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

యాచారం: వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులకు యాచారం పోలీసులు బుధవారం విముక్తి కల్పించారు. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. బాలల హక్కుల పరిరక్షణ విభాగం అధికారి ప్రవీణ్, పోలీసులు సంయుక్తంగా యాచారం, మాల్ కేంద్రాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. యాచారం, మాల్‌లో బైక్ పాయింట్‌లలో ఇద్దరు. స్టీల్ దుకాణంలో పని చేస్తున్న మరో బాలుడికి విముక్తి కల్పించినట్లు తెలిపారు. బాలకార్మికులను చట్ట విరుద్ధంగా పనులు చేసుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అదృశ్యమైన వృద్ధుడు.. అస్థిపంజరంలా లభ్యం

- ఆదిబట్ల ఠాణాలో మూడు నెలల క్రితం మిస్సింగ్ కేసు
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు



యంజాల లక్ష్మయ్య(ఫైల్)



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కుళ్లిన స్థితిలో అస్థిపంజరం లభ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లి రెవెన్యూ బొంగర్లూరు సమీపంలోని అటవీప్రాంతంలో ఓ అస్తపంజరం, పుర్రెను గుర్తించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీంతో కలిసి ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తెల్ల ధోతి, షర్ట్ ధరించాడని.. చేతికి నల్ల దూరం ఉన్నట్లు గమనించారు. మూడు నెలల క్రితం ఎంపీ పటేల్‌గూడకు చెందిన వృద్ధుడు తప్పిపోయాడని కేసు నమోదు అయింది. అనుమానంతో వారి కుటుంబ సభ్యులను రప్పించి పరిశీలించగా యంజాల లక్ష్మయ్య(70)గా గుర్తించారు. గతంలోనూ ఇంట్లోంచి వెళ్లి తిరిగి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తప్పిపోయిన వృద్ధుడు లక్ష్మయ్య అస్థిపంజరంగా కనిపించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాటి చెట్టు పై నుంచి పడి..

గీత కార్మికుడి దుర్మరణం



వెంకటయ్య (ఫైల్)

కడ్తాల్: తాటి చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్ట వెంకటయ్య(45) గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని పొలంలో తాటి చెట్టుకు కల్లు గీయడానికి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. గమనించిన సమీప రైతులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం ఆయన మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తల్లీకొడుకుపై వీధి కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన అంబిక



బాలుడు అఖిల్

కొందుర్గు: వీధికుక్కల దాడిలో తల్లీకొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం గోవులబండ తండాలో బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన ఐదేళ్ల బాలుడు అఖిల్ సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఓ కుక్కదాడి చేసి గాయపరిచింది. గమనించిన బాలుడి తల్లి అంబిక అఖిల్ రక్షించేందుకు యత్నించగా ఆమె పైన సైతం కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

సురేంద్రరావు దుస్తకర్‌కు డాక్టరేట్



ఇబ్రహీంపట్నం రూరల్: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సురేంద్రరావు దుస్తకర్‌ను డాక్టరేట్ వరించింది. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కేఎల్ డీమ్డ్ వర్సిటీ) లో డీప్ లెర్నింగ్ సాయంతో డెప్త్ డేటా అసిస్ట్ హ్యూమన్ యాక్షన్ రికగ్నిషన్ అనే అంశంపై డీఎస్‌రావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వి.భాగ్యరాజు మార్గదర్శకత్వంలో పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం దుస్తకర్‌ను అభినందించారు.

గడ్డమల్లయ్యగూడలో పర్యటించిన హిమాచల్‌ప్రదేశ్ బృందం



నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న హిమాచల్‌ప్రదేశ్ ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని కార్సోగ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం పర్యటించింది. గ్రామీణ ప్రాంతంలో అమలు చేస్తున్న నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్టు, క్రిమిటోరియం, పర్యావరణ స్థిరత్వం, స్వయం అభివృద్ధి, మహిళా సంఘాల పాత్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో మహిళలు ఆర్థిక ప్రగతికి కల్పిస్తున్న చిరు వ్యాపారాలు, రైతుల వ్యవసాయ స్థితిగతులపై అధ్యయనం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు మండల పరిషత్ పాత్ర, పాలకవర్గం, అభివృద్ధి పనులు, సమావేశాలు, తీర్మానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, మండల పరిషత్ విధుల గురించి హిమాచల్‌ప్రదేశ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించారు. కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ కోర్స్ కోఆర్డినేటర్ శశిరేఖ, సీనియర్ కన్సల్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ నాగలక్ష్మి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కప్' స్ఫూర్తితో బీఎంఆర్ కప్



బీఎంఆర్ కప్ పోటీల ప్రారంభోత్సవంలో గాల్లోకి బెలూన్లు వదులుతున్న ఎమ్మెల్యే బీఎంఆర్ తదితరులు

- విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

యాలాల: సీఎం కప్ క్రీడాపోటీల స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయిలో బీఎంఆర్ కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని గౌతమి పాఠశాలలో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. నియోజకవర్గంలోని 50 పాఠశాలల నుంచి 191 టీంలు, 2,100 విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేసి క్రీడా వందనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాజు, గౌతమి పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, నాయకులు హన్మంతు, మహిపాల్, అక్బర్‌బాబా తదితరులు ఉన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి



తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘణపురం వెంకటయ్య, దిశ కమిటీ సభ్యుడు జానకీరాం చౌహాన్ అన్నారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ ఫలితాలు అందక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రలింగం, మోనాచారి, సురేందర్ గౌడ్, శ్రీశైలం, వెంకటేష్, మహేష్‌కుమార్, నరేష్, బి.వెంకటేష్, మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నక్ష రోడ్డు కబ్జా

రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నషాపూర్ గ్రామస్తులు

మొయినాబాద్: రెండు గ్రామాల మధ్య ఉన్న నక్ష రోడ్డు, హరితహారంలో నాటిన మొక్కలను తొలగించి కబ్జాచేసిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని చిన్నషాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దమంగళారం పంచాయతీకి అనుబంధ గ్రామమైన చిన్నషాపూర్ నుంచి అమీర్‌గూడ మీదుగా మొయినాబాద్ వరకు నక్ష రోడ్డు ఉందని.. పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వేనెంబర్ 370, 371, 372లో నుంచి ఉన్న నక్ష రోడ్డును ప్రీమియర్ కాసా బ్లాంక్ లేఅవుట్ చేసిన రియల్ వ్యాపారి కబ్జాచేశారని ఆరోపించారు. నక్షరోడ్డుకు ఇరుపక్కల నాటిన హరితహారం మొక్కలను సైతం జేసీబీతో తొలగించారని చెప్పారు. ఈ నక్ష రోడ్డును కబ్జా చేయడంతో చిన్నషాపూర్-అమీర్‌గూడ గ్రామాల మధ్య రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కబ్జాకు గురైన నక్షరోడ్డును కాపాడి.. కబ్జాచేసిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రవీణ్‌గౌడ్, నరేందర్, కృష్ణారెడ్డి, మాధవగౌడ్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల: రోడ్డు భద్రతా నియమాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సత్యసాయి గ్రామర్ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వాహనాలు రోడ్డుకు ఎడమవైపునే నడపాలని, ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్‌లు వాహనాలు నడుపొద్దని సూచించారు. ఉదయం వాకింగ్‌కు జాతీయ రహదారులను ఉపయోగించవద్దని చెప్పారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, ఏఎస్ఐ అశోక్, ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ అప్పలనాయకుడు, అధ్యాపకులు, విద్యార్థులు, బస్ డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

బొలేరోను ఢీకొట్టిన కారు

ఎనిమిది మందికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: బొలేరో వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన మహిళా కూలీలు బుధవారం ఉదయం బొలేరో వాహనంలో భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కూలీ పనిచేసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సంస్థ సమీపంలోకి రాగానే చెరువు మూలమలుపు వద్ద డ్రైవర్ దొరగండ్ల బాలకృష్ణ వాహన వేగాన్ని తగ్గించి గేట్ లోపలికి వెళ్తుండగా... వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు దొరగండ్ల పారిజాత, కాటమోని యాదమ్మ, గుండ్ల స్వరూప, బుద్దుల లక్ష్మి, ఓర్సు రజని, గుండ్ల కమలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న నాగోల్‌లోని స్నేహపురికాలనీకి చెందిన గుమ్మడి వంశీ, గుమ్మడి శశిధర్‌కు తల, ఛాతిలో గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహిళా కూలీలను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంత లోకాలకు

- బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
- తల్లీ,కూతుళ్ల దుర్మరణం
- తండ్రికి తీవ్ర గాయాలు



లక్ష్మమ్మ, విజయ (ఫైల్)

షాద్‌నగర్: అనారోగ్యంతో ఉన్న కూతురుకు చికిత్స చేయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్ల చివరకు అదే ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం విగతజీవులుగా వెళ్లాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన షాద్‌నగర్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన చిత్తారి గోపాల్(36), లక్ష్మమ్మ(34) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వీరి పెద్ద కూతురు విజయ(14)కు రక్తకణాలు తక్కువగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఉదయం 7.30గంటలకు వారిబైక్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి బయలుదేరారు. ఉదయం 9.45గంటల సమయంలో తుక్కుగూడ ఓఆర్ఆర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక ఉంచి వస్తున్న టిప్పర్ డ్రైవర్ ఒక్కసారిగా శంషాబాద్ టోల్ వైపునకు వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో పడిపోయిన లక్ష్మమ్మ, విజయ తల మీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో తల్లీకూతురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గోపాల్ కాలు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు.